

# నలుపు

## సలీం

నలుపు నారాయణుడో కాదో నాకు తెలీదు కాని ఆ రంగంటే నాకు చిన్నప్పటినుండి ఇష్టం. నేను తెల్లగా ఉండటం కూడా ఓ కారణమేమో.. వ్యతిరేక ధృవాల మధ్య ఆకర్షణలా ఈ రెండు రంగులు సంపూర్ణ రకాలు. ఏడు రంగుల కలయిక తెలుపైతే ఏ రంగూ లేకపోవటం నలుపు. శూన్యం .. చాలా బలమైన అనుభూతి. బ్లాక్ హోల్‌కున్న గురుత్వాకర్షణలా.. అన్నిటిని తనలోకి లాక్కునే మహత్తర శక్తి నలుపు...

నాకు నలుపంటే చాలా ఇష్టం.

''అదేం ఇష్టంరా. నలుపంటే చీకటికి ప్రతీక'' అనేది అమ్మ.

''బ్లాక్ కలర్ సింబలైజెస్ సారో ఆర్ మౌర్నింగ్''- నా స్నేహితుల ఉవాచ.

మానాన్న సెషన్స్ కోర్టులో బంట్రోతు. వూహ తెల్సినప్పటి నుండి నాకు పరిచయమైన ప్రదేశం కోర్టు. తెల్లటి వస్త్రాల మీద నల్లటి కోట్లు ధరించిన లాయర్లు.. వాళ్ళు చెప్తున్న దానికి తల వూపుతూ వారితో పాటు వినయంగా నడుస్తున్న క్లయింట్లు.. చెట్ల కింద వేచి కూచున్న సాక్షులు... యువరానర్ అన్పించుకునే జడ్జీలు...ఆదో అద్భుత ప్రపంచంలా ఉండేది.

మూడోక్లాస్ చదువుతున్నప్పుడు ''పెద్దయ్యాక ఏం కావాలనుకుంటున్నావు'' అనే ప్రశ్నకు మిగతా పిల్లలు ఇంజనీరు, డాక్టరు, కలెక్టరు వగైరా సమాధానాలు చెప్పారు. నేనొక్కడినే 'లాయర్' అని దృఢంగా సమాధానమిచ్చాను.

''ఎందుకు?'' అనే ప్రశ్నకు మాత్రం ''నల్లకోటు వేసుకోవచ్చు'' అన్చెప్పానని తెలిసి మా అమ్మానాన్న పడీపడీ నవ్వటం నాకింకా గుర్తుంది.

లాయర్ కావాలనే కోరిక ఏ క్షణంలో నాటబడిందో తెలీదు కాని అది బలంగా వేళ్ళూనుకుని మహావృక్షమైంది.

''వద్దురా. నీ మనస్తత్వానికి అలాంటి వృత్తి పనికి రాదు.'' అనేవాడు నాన్న.

మా ఇంట్లో న్యాయదేవత బొమ్మ ఉండేది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసింది. తెల్లటి బొమ్మ...కళ్ళ దగ్గర నల్లటి రిబ్బన్‌తో కట్టేసి..

న్యాయదేవత చూడలేకపోవటం నాకు నచ్చేది కాదు. కళ్ళతో చూడకుండా న్యాయం ఎలాచేయవచ్చో ఎంతాలోచించినా అర్థమయ్యేది కాదు.

కళ్ళకున్న నల్లటి గంతల్ని విప్పదీసేసేవాడిని. నాన్న మరలా కట్టేవాడు.

''న్యాయం సాక్ష్యాధారాలమీద ఆధారపడ్తుంది. ఒక్కోసారి మనం కళ్ళతో చూసింది కూడా నిజం కాకపోవచ్చు. కోర్టుకి చెవులుంటాయి కాని కళ్ళుండవు'' అనేవాడు నాన్న.

కళ్ళతో చూసిందే నిజం కానపుడు చెవుల్తో విన్నదెలా నిజమవుతుందో నాకు అంతుబట్టేది కాదు. చెవుల్తో విని, కళ్ళతో చూసి, మేధస్సుతో ఆలోచించి న్యాయం చెప్పవచ్చు కదా.

నేను మరలా నల్లటి రిబ్బన్‌ని విప్పదీసేవాడిని. నాన్న కట్టేవాడు. చిన్నప్పుడంతా ఇదే తంతు...

మల్లికార్జున్‌గారు మానాన్నకు సహాధ్యాయి. పల్లెటూరి వాతావరణంలో పెరిగి, కటిక పేదరికాన్ని మనోనిబ్బరంతో ఎదుర్కొని, మంచి మార్కుల్తో చదివి, న్యాయవాద వృత్తి చేపట్టి ప్రస్తుతం జడ్జి స్థాయికి ఎదిగారు. నాన్న వారి గురించి చెప్తుంటే ఆరాధనాభావంతో వినేవాడిని. నా మనసులో నాటుకుపోయిన హీరో ఇమేజ్ వారిదే. నాకు రోల్‌మోడల్. పట్టుదలతో చదివి, అంత గొప్పవాణ్ణి కావాలని కలలు కనేవాడిని.

నా కలల్ని సాకారం చేసుకునే క్రమంలో డిగ్రీ పూర్తయ్యాక ఆంధ్రా యూనివర్సిటీలో బి.యల్ కోర్సులో చేరాను. వాల్తేర్‌కు బయల్దేరుతున్నప్పుడు వీడ్కోలివ్వడానికి స్టేషన్‌కొచ్చిన నాన్న "మల్లికార్జున్ వైజాగ్‌లోనే గాజువాకలో ఉన్నాడు. నీ గురించి వివరంగా ఉత్తరం రాశాను. అప్పుడప్పుడూ వెళ్ళి కలుస్తూ ఉండు.'' అన్నారు.

హాస్టల్లో చేరి వారం దాటింది. అక్కడి వాతావరణానికి కొంత అలవాటు పడ్డాననిపించాక ఓ ఆదివారం నాన్నగారిచ్చిన అడ్రస్ పట్టుకుని గాజువాక బయల్దేరాను. జడ్జిగారు కదా. ఇల్లు సులభంగానే కనుక్కోగలిగాను. నా అదృష్టం.. వారు ఇంట్లోనే ఉన్నారు.

నన్ను నేను పరిచయం చేసుకోగానే ఆత్మీయంగా లోపలికి ఆహ్వానించారు.

''రావోయ్ సత్యం. నీ గురించి మీ నాన్న నాలుగు పేజీల ఉత్తరం రాశాడు. పోయిన వారమే వస్తావనుకున్నా...'' అన్నారు.

వారి ఎదురుగా సోఫాలో వినయంగా, భక్తిగా కూచున్నాను. వారు మానాన్నకు సహాధ్యాయి ఐనా నాకు మాత్రం గౌరవనీయులైన జడ్జిగారు. నేను లాయర్ అయినాక వారి ఎదురుగా నిలబడి, తల వొంచి అభివాదం చేసి, యువరానర్ అనాల్సిన వ్యక్తి.

''సరిగ్గా కూచోవోయ్. ఫీల్ ఎట్ హోమ్. మీనాన్న ఎలా ఉన్నాడు? నీకు చెప్పే ఉంటాడు. మేమిద్దరం ఒకే వూరివాళ్ళం. కలిసే చదువుకున్నాం. మీనాన్న సగంలో చదువు ఆపేశాడు. నేను భగీరథ ప్రయత్నం చేసి ఎలాగోలా చదువు పూర్తిచేశా.

''నాన్న మీ గురించి ఎప్పుడూ చెప్తూనే ఉంటారండి. నాలాంటి ఎంతోమంది యువకులకు మీరు ఆదర్శం. మీ స్ఫూర్తితోనే నేను లాయర్ కావాలనుకున్నాను.'' అన్నాను.

వారు ఇబ్బందిగా కదిలారు. గొప్పవాళ్ళకు పొగడ్తలిష్టం ఉండవు.

''మీ నాన్నకేమో నిన్ను ఇంజినీర్ని చేద్దామని కోరిక. నువ్వు లాయర్ కావటం ఎందుకో అతని కిష్టం లేదు. నేనూ చెప్పాను. న్యాయవాద వృత్తి ఎంత గొప్పదో. అయినా దాదాపు పాతికేళ్ళుగా కోర్టుల్ని చూస్తున్న వ్యక్తి. మనం చెప్పాలా ఏమిటి?''

''నా చిన్నప్పటి నుండీ నేను లాయర్ని కావాలనే కోరుకున్నాను సార్.''

''చాలా సంతోషం. నీ నిజాయితీ గురించి, నీకున్న అభ్యుదయ భావాల గురించి కూడా రాశాడ్లే. అదే అతని దిగులు.. నువ్వీ వృత్తిలో నెగ్గుకు రాలేవని. న్యాయ వ్యవస్థకి గొప్ప ఆదర్శాలున్న నీలాంటి యువకుల అవసరం ఎంతైనా ఉంది. ఆల్ ది బెస్ట్.''

''థాంక్స్ సార్. లా చదువుతున్న చాలా మందికి మీరే రోల్ మోడల్.''

వారు ఇబ్బందిగా నవ్వుతూ ''నన్ను అంకుల్ అనవోయ్. సార్ అంటుంటే దూరం అన్పిస్తోంది.'' అంటూ లోపలికి కేకేసి '' ఏమోయ్. మన సత్యం ఈ పూట భోజనం ఇక్కడే చేస్తాడు. ఆ ఏర్పాట్లు చూడు'' అన్నారు.

''వద్దండీ. హాస్టల్‌కెళ్లాను.'' అన్నాను బిడియంగా.

''నువ్వో విషయం గమనించలేదు. నేను నీ అనుమతి తీసుకోలేదు. అంటే నా ఆర్డర్ అన్న మాట. తిరుగులేదు. అప్పీలూ లేదు.'' పెద్దగా నవ్వారాయన.

''నువ్వు లా కోర్సులో చేరి మంచి పని చేశావు. న్యాయవాద వృత్తి చాలా ఉన్నతమైంది. అనాథల, అన్నార్తుల, అభాగ్యుల, పీడిత జనాల తరపున వకాల్తా పుచ్చుకుని న్యాయంకోసం పోరాడటం ఎంత గొప్ప విషయం. నిజం చెప్పాలంటే నాకు జడ్జిగా ఈ ఉద్యోగం కంటే న్యాయవాదిగానే బావుండింది.

''ఇరువైపుల వారి వాదనలు విని, నిష్పక్షపాతంగా, న్యాయదేవత ప్రతిరూపంలా తీర్పునివ్వడం గొప్ప విషయం కాదా...'' అన్నాను వారి మనోగతం అర్థం కాక.

''నిజమే. కాని మా అంతరాత్మ నోరు నొక్కేసి, కేవలం సాక్ష్యాల మీద, వాంగ్మూలాల మీద ఆధారపడి తీర్పు చెప్పాల్సి రావడం బాధ కలిగిస్తుంది. ఒకోసారి మేము ఇవ్వబోతున్న తీర్పు సరైంది కాదని తెల్సినా, సాక్ష్యాధారాలు బలంగా లేని కారణంగా గత్యంతరం లేని పరిస్థితుల్లో అటువంటి తీర్పు చెప్తున్నప్పుడు మనసు ఎంతటి క్షోభకు గురౌతుందో తెలుసా సత్యం?''

వారి ఆంతర్యం అర్థమై మనసంతా వారి మీది గౌరవంతో నిండిపోయింది. వారు నాకళ్ళకు నిలువెత్తు న్యాయ దేవతలా కన్పించారు. కళ్ళకు నల్లటి గంతలు లేని న్యాయదేవత..

భోజనం సమయంలో కూడా కోర్టుల గురించి, సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉండిపోయే కేసుల గురించీ, న్యాయం నడిబజార్లో అమ్ముడుపోవటం గురించీ చెప్తూనే ఉన్నారు.

''సాక్షులు చెట్ల కింద కూచుని ఉంటారు. కాసిని డబ్బులకాశపడి లాయర్లు చెప్పమన్నట్లు సాక్ష్యం చెప్తారు. వాళ్ళది పొట్టకూటికోసం పడే తాపత్రయం. కాని ముద్దాయికది జీవన్మరణ సమస్య. అబద్ధపు సాక్షి అని తెలుస్తోనే ఉంటుంది. అయినా తీర్పు వాటినాధారం చేసుకునే చెప్పాల్సి వస్తుంది. ఎంతో ఉన్నతమైన వృత్తిని డబ్బుకోసం ఎంత నీచ స్థితికి దిగజార్చారో తల్చుకుంటే గుండె బరువెక్కుతుందయ్యా'' అన్నారు. వారి మొహంలో ఆ బరువుని మోస్తున్న ఛాయలు...

హాస్టల్‌కి తిరిగొచ్చాక చాలా రోజుల వరకు వారి మాటలు నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. ఎంతటి ఆదర్శమూర్తి! ఎంతటి సమున్నత వ్యక్తి!


నా రూమ్మేట్ మధుతో ఈ విషయాలు చర్చకు వచ్చినపుడు ''అసలు రోల్ మోడల్స్ అవసరం ఉందంటావా?'' అన్నాడు.

''తప్పకుండా. నాలుగు రోడ్ల కూడలిలో నిలబడిన యువతకు పథ నిర్దేశం చేయడానికి రోల్‌మోడల్స్ ఉండాలి. వాళ్ళ వ్యక్తిత్వాల బలంతో తమ ఆదర్శాల వైపుకి మన చేయి పట్టుకుని నడిపించే శక్తి రోల్ మోడల్స్‌కుంటుంది. లేకపోతే యువత దిశాహీనమైపోయే ప్రమాదముంది.''

''అలాంటప్పుడు చనిపోయిన ఏ గాంధీనో, నెహ్రూనో ఆదర్శంగా పెట్టుకోవటం ఉత్తమం.''

''ఎందుకని? ఆ రోజులు వేరు. అప్పటి సామాజిక, ఆర్థిక సమస్యలు వేరు. ప్రస్తుత సమాజంలో కూడా ఎందరెందరో మహానుభావులున్నారు. మన కళ్ళెదుట, నేటి విపత్కర పరిస్థితులనెదుర్కొంటూ విజయాల్ని సాధిస్తున్న వీళ్ళనే రోల్‌మోడల్స్‌గా తీసుకోవాలి.''






మధు నవ్వాడు. ''చనిపోయిన వాళ్లయితేనే బెటర్. వాళ్ల వ్యక్తిత్వంలోని బలాలూ బలహీనతలు చరిత్రలో లిఖించబడ్డాయి. మార్పుండదు. బతికున్నవాళ్ల విషయంలో అటువంటి హామీలేమీ ఇవ్వలేం.''

నైతిక విలువల కోసం పోరాడే వ్యక్తి ఓడిపోతాడేమో కాని దిగజారిపోడని నా నమ్మకం.

మరోనెల వరకు మల్లికార్జున్‌గార్ని కల్సుకోవటం కుదర్లేదు.

ఆగస్ట్ 15.. శెలవు కాబట్టి ఫోన్ చేసుకుని వారి అనుమతి తీసుకుని ఇంటికెళ్ళాను.

సాయంత్రం ఆరు గంటల సమయం.. వసారాలో పడక్కుర్చీలో వారు విశ్రాంతి తీసుకుంటున్నారు.

''రావోయ్ సత్యం. స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. ఎలా సాగుతోంది చదువు?'' అంటూ పరామర్శించారు.

మాటల సందర్భంలో రెండేళ్ళ క్రితం సంచలనం సృష్టించిన నర్సింగ్ హత్య కేసు ప్రస్తావనకొచ్చింది. ప్రస్తుతం వాదోపవాదాలు నడుస్తున్నాయని పేపర్లలో చదివాను.

''పట్టపగలు జగదాంబ సెంటర్లో జరిగిందా హత్య. అందరూ చూస్తుండగానే సాయిలు అనే వీధి రౌడి నర్సింగ్ అనే యువకుణ్ణి నడి రోడ్డు మీద కొడవలితో నరికి చంపేశాడు. పక్కనే ఉన్న షాపులో సిగరెట్లు కొనుక్కుని వెళ్ళినంత నింపాదిగా రక్తం కారుతోన్న కొడవలిని చొక్కాకి తుడుచుకుంటూ వెళ్ళిపోయాడని పత్రికల కథనం.'' అన్నారు.

''మరి ప్రాసిక్యూషన్ వారికి కష్టమేముంది? హత్య ఎవరు చేశారో తెల్సింది కాబట్టి తీర్పు చెప్పటం కూడా సులభమే.''

''అక్కడే తిరకాసుంది సత్యం. సాయిలు కరడుగట్టిన రౌడి. వాడికి రాజకీయ నాయకుల అండదండలున్నాయి. వాడికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పటానికి ఎవ్వరూ ముందుకు రావటం లేదు. అతనికేదో మోటివ్ ఉందన్న అనుమానం తప్ప అతనే ఈ హత్య చేశాడనటానికి బలమైన ఆధారాలేమీ ప్రాసిక్యూషన్ దగ్గర లేవు.''

ఆరున్నరప్పుడు పళ్ళబుట్టలు, స్వీట్లు పట్టుకుని కొంతమంది వచ్చారు.

''ఇప్పుడే వస్తానుండు.'' అని మల్లికార్జున్ గారు వాళ్ళతో కొద్దిసేపు మాట్లాడి, పంపించి వచ్చారు.

''అభిమానమోయ్. ఎంత వారించినా వినరు. పండ్లూ స్వీట్లు పంపిస్తూ ఉంటారు. మామూలుగా ఏ ఉగాదికో దసరాకో దీపావళికో స్వీట్లు పంచుతుంటారు కదా. ఓసారి టీవి ఇంటర్వ్యూలో 'మీకిష్టమైన పండుగ ఏదని' అడిగితే మనకు స్వతంత్రం వచ్చిన ఆగష్టు పదిహేనో తారీకని చెప్పాను. అదుగో అప్పటి నుండి యిలా.. జడ్జిగా ఉండి ఇలాంటివి తీసుకోవటం తప్పని తెల్సినా కొన్నిటిని కాదనలేం కదా..''

ఆగష్టు పదిహేను తనకిష్టమైన పండుగ అన్చెప్పిన వారి దేశభక్తికి మనసులోనే చేతులు జోడించి నమస్కరించాను.

మరునాడు లైబ్రరీలో కూచుని నర్సింగ్ హత్య కేసుకి సంబంధించిన సమాచారాన్నంతా పాత పేపర్లలోంచి సేకరించాను.

సాయిలు యింటి పక్కనే ఉండే నర్సింగ్ డాక్‌యార్డులో పనిచేస్తాడు. తను లేని సమయంలో తన భార్యతో నర్సింగ్ చనువుగా ఉంటున్నాడని చుట్టుపక్కలవాళ్ళు చెవులు కొరుక్కోవటం సాయిలుకి తెల్సి నర్సింగ్‌తో గొడవపడి చావబాదాడు. మరోసారి తన యింటి ఛాయల్లో కన్పిస్తే చంపేస్తానని వార్నింగ్ కూడా ఇచ్చాడు. అయినా నర్సింగ్ తన ప్రవర్తనని మార్చుకోలేదు. అందుకే పథకం ప్రకారం జగదాంబ సెంటర్లో కొడవలితో నరికి చంపాడు.

పరీక్షలు మరో పదిహేను రోజుల్లో ఉన్నాయనగా మల్లికార్జున్‌గారింటికెళ్లాను.

కాఫీ ఫలహారాలయ్యాక ''సాయిలు కేసేమైంది సార్?'' అని అడిగాను.

''ఏమౌతుంది.. మామూలే. హత్య జరిగిన రోజు అమలాపురంలో లాడ్జిలో దిగినట్టు రసీదు పుట్టించారు. అదే రోజు బాత్రూంలో జారిపడటం వల్ల తలకు బలమైన దెబ్బలు తగిలి సునంద నర్సింగ్ హోంలో జాయినయి ట్రీట్మెంట్ తీసుకున్నట్లు ఎలిబీ సృష్టించారు ప్రాసిక్యూషన్ వారు, పోలీసులూ అతనితో కుమ్మక్కైనట్లనిపిస్తోంది. డబ్బులు మంచినీళ్లలా ఖర్చు చేసి అందర్నీ కొనేస్తున్నారయ్యా. గాంధీ నెహ్రూలు కలలు కన్న స్వతంత్ర భారతదేశం యిదేనా అని దిగులేస్తుందయ్యా. అతనే హత్య చేసాడని లోకం కోడై కూస్తున్నా అతనికి శిక్ష వేయడానికి సరిపడా సాక్ష్యాలు లేవు.'' ఒక దోషి తప్పించుకుంటున్నాడే అన్న దిగులు వారి మొహంలో...

నేనెప్పటికైనా ఆయనంత ఉన్నతంగా, ఆదర్శంగా నన్ను నేను మల్చుకోవాలని నిర్ణయించుకున్నా.

ఆ తర్వాత సెమిస్టర్ పరీక్షలయ్యేవరకు వారింటికి వెళ్ళటానికి కుదరలేదు.

పరీక్షలయిన మర్నాడు ఆదివారం కాకున్నా వారింటికి బయల్దేరాను. నా రోల్ మోడల్ని చూసి, మాట్లాడటం వల్ల నాలో నూతనోత్తేజం కలుగుతుంది. నా లక్ష్యాన్ని చేరుకోవాలన్న సంకల్పం బలపడ్తుంది. వారిని దూరం నించి చూసినా నాలాంటి వారికి టానిక్కులా పనిచేస్తుంది.

నేను వెళ్ళే సమయానికి యింటినిండా చాలా మంది మనుషులు గుమికూడి ఉన్నారు. పోలీసులూ, జర్నలిస్టులూ, సాధారణ పౌరులూ... జడ్జిగారు కదా ఏదో కేస్ విషయమై వచ్చి ఉంటారనుకున్నా.

వాళ్ళ మధ్య తల వొంచుకుని నిలబడి ఉన్నారు మల్లికార్జున్ గారు. నాదేశ జండా తల వొంచుకున్నట్లనిపించి, భయమేసి ఓ జర్నలిస్ట్‌ని అడిగాను.

''మోస్ట్ సెన్సేషనల్ న్యూస్. శాయిలుని నిర్దోషిగా తీర్పు చెప్పటానికి రెండు లక్షలు లంచం తీసుకుంటూ ఏ.సీ.బీకి రెడ్ హాండెడ్‌గా పట్టుబడ్డారు జడ్జిగారు.''

నానెత్తిన పిడుగు పడ్డట్లు దిగ్భ్రమకు లోనయ్యాను. మల్లికార్జున్ గారు లంచం తీసుకున్నారా? నేను నమ్మను. అంత గొప్ప వ్యక్తి.. ఆదర్శవాది...న్యాయదేవతకు ప్రతిరూపం.. కళ్ళకు గంతలు లేని న్యాయదేవత.. నా గురువు.. ఆదర్శం.. నా రోల్ మోడల్..

పోలీసులు జడ్జిగార్ని నడిపించుకుంటూ పోలీస్ జీపు వైపుకు వస్తున్నారు.

వాళ్ళకి దారి ఇస్తూ పక్కకు తప్పుకున్నా. మల్లికార్జున్‌గారు నాకు దగ్గరగా వచ్చినపుడు తల యెత్తి నావైపు చూసి మరలా తలదించుకున్నారు.

ఎంత కష్టమైనా పేదరికాన్ని ఎదుర్కోవచ్చు. కరువుని తట్టుకోవచ్చు. కాని రోల్ మోడల్స్ కరువైతే...అగమ్యంగా నడుస్తూ...నాలానే..నాకెదురౌతున్న యువకులు...

★